క్లుప్తంగా

పీజీఆర్‌ఎస్‌కు 10 వినతులు


అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్‌ రమేష్‌

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్‌ తహసీల్దార్‌ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్‌) కార్యక్రమానికి 10 వినతులు అందాయి. ప్రజల నుంచి వాటిని తహసీల్దార్‌, మండల ఎగ్జిక్యూటివ్‌ మేజిస్ట్రేట్‌ ఎం.రమేష్‌ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం విద్యార్థులతోపాటు పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్‌ ఎ.త్రినాథ్‌, ఆర్‌ఐ ప్రేమలత, వీఆర్‌వోలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రైతుబజారు స్టాళ్లకు డ్రా


రైతులకు స్టాల్‌ టోకెన్లు అందిస్తున్న ఈవో కృష్ణమూర్తి

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజారులో సోమవారం మొత్తం 140 స్టాళ్లకు ఈవో కృష్ణమూర్తి డ్రా తీశారు. ఉదయం, సాయంత్రం బజార్లు నిర్వహిస్తున్న రైతులకు స్టాళ్లు కేటాయించి టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ రైతులు విధిగా వారికి కేటాయించిన స్టాళ్లలోనే కూరగాయలు విక్రయించాలని సూచించారు. స్టాళ్లు ఉన్న రైతులునేల మీద కూరగాయలు విక్రయించరాదన్నారు.

లలితా పీఠంలో పుష్పయాగం


సీతారాములకు పుష్పయాగం చేస్తున్న అర్చకులు

సీతంపేట: వసంత నవరాత్రుల్లో భాగంగా సోమవారం లలితానగర్‌ శ్రీలలితా పీఠంలో సీతారాములకు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, చక్రస్నానం, మహా పూర్ణాహుతి జరిపారు. అనంతరం స్వామి వారికి అర్చన, ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, 12 రకాల ఫల నివేదన సమర్పించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లకు పుష్పయాగం, చతుర్వేద పారాయణ, నీరాజన మంత్రపుష్పం నిర్వహించారు. పీఠంలో ఏర్పాటు చేసిన కర్ణాటక గాత్ర కచేరి అలరించింది. మూనూరు శ్రీకాంత్‌ అన్నమయ్య, త్యాగరాజ కీర్తనలు ఆలపించారు. కె.శ్రీరామ్‌ శ్రీనివాస్‌ వయోలిన్‌పై, టి.ఎస్‌.చైతన్య మృదంగంపై సహకారం అందించారు. సీతంపేట పార్వతీశ్వరాలయంలో వేదమంత్రాల నడుమ శ్రీరామ పట్టాభిషేకం ఘనంగా నిర్వహించారు.

రైల్వేస్టేషన్‌లో 3 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని, 3 కిలోలు స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్‌ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. విశాఖ జీఆర్పీ ఇన్‌స్పెక్టర్‌ సిహెచ్‌.ధనుంజయ నాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఎస్‌కే అబ్దుల్‌ మారూఫ్‌, ఆర్పీఎఫ్‌ ఎల్‌ఎస్‌ఐ పి.ఆర్‌.బిషోయి వారి సిబ్బందితో కలిసి విశాఖ రైల్వేస్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫారాల్లో సోమవారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఏపీకి చెందిన తనాకి శాలిందాజ్‌ విశాఖపట్నం స్టేషన్‌ మీదుగా అక్రమంగా కృష్ణా జిల్లా విజయవాడకు గంజాయి రవాణా చేయడాన్ని ఆర్పీఎఫ్‌ ఎస్‌ఐ బిషోయి గుర్తించి, జీఆర్పీ ఎస్‌ఐ అబ్దుల్‌కు అప్పగించారు. రూ.15 వేల విలువైన 3 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని, అతడిని రిమాండ్‌ నిమిత్తం కోర్టులో హాజరు పరిచారు.

సీఏ ప్రాక్టీస్‌ కార్యాలయం ప్రారంభం

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు నరసింహనగర్‌లో చార్టర్డ్‌ అకౌంటెట్స్‌ ప్రాక్టీస్‌ కార్యాలయం, చాంబర్స్‌ను సోమవారం ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, ఎస్‌.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిలు ప్రారంభించారు. వ్యాపార సంస్థలు, పన్ను చెల్లింపుదారులకు సీఏ, ట్యాక్స్‌ కన్సల్టెంట్స్‌ సర్వీస్‌లు ఎంతో అవసరమని ఎమ్మెల్యేలు తెలిపారు. యువ సీఏలు ఈ ప్రాంతంలో కార్యాలయాలను ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఇదే ప్రాంగణంలో నక్కా వేణు నెలకొల్పిన టాక్స్‌ వైజ్‌ కన్సల్టెన్సీని కూడా వీరు ప్రారంభించారు.

టార్గెట్ → పాలిసెట్



- టెన్త్‌ విద్యార్థులకు వరం పాలిటెక్నిక్‌ విద్య
- ఉపాధి అవకాశాలు, ఉన్నత విద్యకు మార్గాలు
- అందుబాటులో ఉచిత కోచింగ్‌ సెంటర్లు

మురళీనగర్‌:

పదో తరగతి అనంతరం సాంకేతిక విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు పాలిటెక్నిక్‌ మంచి అవకాశంగా చెప్పవచ్చు. ఇంటర్మీడియట్‌ విద్య కాకుండా పాలిటెక్నిక్‌ చదివితే ఇటు ఉపాధి అవకాశాలు., అటు ఉన్నత విద్యకు మార్గాలు మెరుగవుతాయి. ఈ నేపథ్యంలో టార్గెట్‌ పాలిటెక్‌లో భాగంగా సాంకేతిక విద్యా శాఖ పాలిటెక్నిక్‌ విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టి రాష్ట్రంలోని అన్ని పాలిటెక్నిక్‌ కాలేజీల్లో సీట్లు భర్తీ చేయడానికి ఇప్పటి నుంచే ప్రయత్నాలు ప్రారంభించింది. దీనిలో భాగంగా పాఠశాలల్లో పాలిటెక్నిక్‌ విద్యపై అవగాహన కల్పించడంతోపాటు పాలిసెట్‌కు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తోంది. దీంతో మురళీనగర్‌ ప్రాంతంలోని పాలిసెట్‌ ఉచిత కోచింగ్‌ కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి.


కెమికల్‌ ఇంజనీరింగ్‌ కాలేజీలో గణితం బోధిస్తున్న ప్రిన్సిపాల్‌ వెంకటరమణ

2023లో శిక్షణ ప్రారంభం..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేద విద్యార్థులతోపాటు ఇతర విద్యార్థులకు ఉచితంగా పాలిసెట్‌ శిక్షణ తరగతులు ప్రవేశపెట్టింది. అప్పటి రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ కమిషనర్‌ చదలవాడ నాగరాణి దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని 2023లో ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఇవి సత్ఫలితాలిచ్చాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని 87 ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కాలేజీల్లో ఉచితంగా పాలిసెట్‌ కోచింగ్‌ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం ప్రైవేటు విద్యా సంస్థలు, స్వచ్ఛంద సేవా సంస్థలు కూడా ఉచితంగా కోచింగ్‌ ఇస్తున్నాయి.


కంచరపాలెంలో ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కాలేజీ

అనుభవజ్ఞులైన అధ్యాపకులతో కోచింగ్‌

పాలిసెట్‌ కోచింగ్‌లో అనుభవజ్ఞులైన కాలేజీ అధ్యాపకులతో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని పాలిటెక్నిక్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కె.నారాయణరావు, గైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కె.వెంకటరమణ తెలిపారు. మహిళా వాకర్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో 40 ఏళ్ల పాలిసెట్‌ కోచింగ్‌లో అనుభవం ఉన్న వీటీబీ పట్నాయక్‌ ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి 15 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తామని క్లబ్‌ అధ్యక్షురాలు కె.మాధవి చెప్పారు. పదో తరగతి పాసైన వారితోపాటు ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాసిన వారు శిక్షణలో చేరవచ్చు.


పాలిటెక్నిక్‌ కాలేజీలో పాలిసెట్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్‌ నారాయణరావు


కంచరపాలెం ప్రభుత్వ కెమికల్‌ ఇంజనీరింగ్‌ ఇన్‌స్టిట్యూట్‌

ఈ కేంద్రాల్లో ఉచిత శిక్షణ

కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కాలేజీ, కంచరపాలెం ప్రభుత్వ కెమికల్‌ ఇంజనీరింగ్‌ ఇన్‌స్టిట్యూట్‌(గైస్‌)తోపాటు మురళీనగర్‌లోని డిస్ట్రిక్ట్‌-101 గవర్నర్‌ కార్యాలయ ప్రాంగణంలో మాధవధార మహిళా వాకర్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో పాలిసెట్‌కు ఉచిత శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఇక్కడ తెలుగు, ఇంగ్లిష్‌ మీడియంలో విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తారు.

పాలిసెట్‌ కోచింగ్‌ ఇలా..

పాలిసెట్‌-2025కు సిద్ధమయ్యే విద్యార్థులకు ప్రతి రోజు మూడు గంటలు కోచింగ్‌ ఇస్తారు. ఉదయం 9.30 నుంచి 12.45 వరకు ఉంటుంది. గణితం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం సబ్జెక్టులకు ఒక్కో దానికి గంట సేపు కోచింగ్‌ ఇస్తారు. ఇందుకోసం కాలేజీల్లోని జనరల్‌ సెక్షన్‌ అధ్యాపకులు బోధిస్తారు.

ఉచితంగా స్టడీ మెటీరియల్‌


విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ అందిస్తున్న ప్రిన్సిపాల్‌ నారాయణరావు

పాలిసెట్‌ పరీక్షకు మెటీరియల్‌ కొనాలంటే వందల రూపాయల్లో ఖర్చవుతుంది. ప్రస్తుతం నిర్వహిస్తున్న శిక్షణ కేంద్రాల్లో ఉచితంగా స్టడీ మెటీరియల్‌ అందిస్తారు. పాలిటెక్నిక్‌ కాలేజీలో 200 మందికి, కెమికల్‌ ఇంజినీరింగ్‌ కాలేజీలో 100 మందికి ఉచితంగా పుస్తకాల పంపిణీకి సిద్ధం చేశారు. ప్రస్తుతం ఈ కేంద్రాల్లో కొత్తవారిని చేర్చుకోవడానికి అవకాశముంది. ఈ కాలేజీల్లో తెలుగు, ఇంగ్లిష్‌ మీడియంలో ప్రభుత్వం ముద్రించిన స్టడీ మెటీరియల్‌ అందజేస్తారు. పాలిటెక్నిక్‌ కాలేజీలో బాలికలు, బాలురకు వేరువేరుగా తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఇక్కడ తరగతులు ప్రారంభమయ్యాయి. సోమవారం నుంచి పూర్తి స్థాయిలో తరగతులు కొనసాగుతాయి.



ప్రభుత్వం ముద్రించిన స్టడీ మెటీరియల్‌

30న ప్రవేశ పరీక్ష

ఈ నెల 30న పాలిటెక్నిక్‌ కామన్‌ ఎంట్రన్స్‌ టెస్ట్‌(పాలిసెట్‌) నిర్వహిస్తారు. ఆరోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుంది. గణితం 50 మార్కులకు 50 ప్రశ్నలు, భౌతిక శాస్త్రం 40 మార్కులకు 40 ప్రశ్నలు, రసాయన శాస్త్రం 30 మార్కులకు 30 ప్రశ్నలు ఉంటాయి. మొత్తం 120 మార్కులకు 120 నిమిషాలు అంటే రెండు గంటల పాటు పరీక్ష జరుగుతుంది.

సాంకేతిక విద్యతో ఉపాధి అవకాశాలు

మురళీనగర్‌: సాంకేతిక విద్య ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని వాకర్స్‌ ఇంటర్నేషనల్‌ జిల్లా 101 కాన్ఫరెన్స్‌ చైర్మన్‌ కమల్‌ బైద్‌ అన్నారు. మాధవధార మహిళా వాకర్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో మురళీనగర్‌ సెక్టార్‌-8లోని బాలభాను పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పాలిసెట్‌ ఉచిత శిక్షణ తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడ శిక్షణ పొంది పాలిసెట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు తమ సంస్థ తరఫున సహకారం అందిస్తానన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం కోసం క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. వాకర్స్‌ డిస్ట్రిక్ట్‌-101 గవర్నర్‌ కె.ద్వారకానాథ్‌ మాట్లాడుతూ పాలిసెట్‌లో విద్యార్థులు తమ సత్తా చాటి ఉత్తమ ర్యాంకులు సాధించాలన్నారు. మహిళా వాకర్స్‌ క్లబ్‌ అధ్యక్షురాలు కె.మాధవి మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు తమ క్లబ్‌ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. త్వరలో మరిన్ని వేసవి ఉచిత శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తామన్నారు. మురళీనగర్‌ జీవీఎంసీ ఉన్నత పాఠశాల, బాలభాను విద్యాలయం, మురళీమాధవ విద్యాలయం, రవీంద్ర భారతి, గాయత్రి విద్యా మందిర్‌, సూర్యోదయ పబ్లిక్‌ స్కూల్‌, శ్రీ చైతన్య, టింపనీ పాఠశాలల నుంచి 45 మంది విద్యార్థులు శిక్షణకు హాజరయ్యారు. క్లబ్‌ కార్యదర్శి పి.కమల, బాలభాను విద్యాలయం ప్రిన్సిపాల్‌ శుభశ్రీ, వైస్‌ ప్రిన్సిపాల్‌ టి.మనోరమణి, తెలుగు ఉపాధ్యాయిని సిహెచ్‌.ప్రవీణ, ఫిజికల్‌ డైరెక్టర్‌ సిహెచ్‌.రమణ, వాకర్స్‌ ఇంటర్నేషనల్‌ ఎడిటర్‌ డి.శిరీష, ఇతర ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


టెన్త్‌ విద్యార్థులకు సూచనలిస్తున్న కమల్‌ బైద్‌

బహిరంగంగా ధూమపానం చేస్తే జరిమానా

సీతమ్మధార: పాన్‌, కిరాణా షాపుల్లో బీడీలు, పాన్‌ పరాగ్‌లు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఫోర్త్‌ టౌన్‌ సీఐ ఎ.సత్యనారాయణ హెచ్చరించారు. నగర పోలీస్‌ కమిషనర్‌ ఆదేశాల మేరకు ఈస్ట్‌ ఏసీపీ లక్ష్మణరావు ఆధ్వర్యంలో సీఐ సత్యనారాయణ పర్యవేక్షణలో సోమవారం స్టేషన్‌ పరిధిలోని స్కూళ్లతోపాటు పాన్‌ షాపులు, దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. కైలాసపురంలోని రెండు స్కూళ్లు, ముంతాజ్‌ హోటల్‌, దరి ఒక స్కూల్‌, కేంద్రీయ విద్యాలయం, హబీజనార్‌ ఎస్‌ఆర్‌డీ స్కూల్‌, స్కూళ్ల ప్రాంతాలలో పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఉత్తర పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో నాలుగు టీంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తన ఆధ్వర్యంలో ఒక టీం, ఎస్‌ఐలు జి.వెంకటరావు ఒక టీం, చిన్నమ్మ నాయుడు ఒక టీం, లక్ష్మణ్‌నాయుడు ఒక టీంగా ఏర్పాటు చేసి ప్రతి పాన్‌, కిరాణా షాపులో సోదాలు నిర్వహించినట్లు చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో సిగరెట్లు తాగితే రూ.200 జరిమానా విధిస్తామన్నారు. గుట్కాలు, పాన్‌పరాగ్‌లు స్వాధీనం చేసుకుని ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగిస్తామన్నారు. ఎస్‌ఐలు వెంకటరావు, చిన్నమ్మ నాయుడు, లక్ష్మణ్‌ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.


దుకాణంలో తనిఖీ చేస్తున్న ఫోర్త్‌టౌన్‌ సీఐ సత్యనారాయణ

నడకతో ఆరోగ్యం పదిలం


మాట్లాడుతున్న డాక్టర్‌ వెంకటసాయికిరణ్‌

మురళీనగర్‌: ప్రతి రోజు కనీసం 45 నిమిషాలు నడవడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని జనరల్‌ ఫిజీషియన్‌ డాక్టర్‌ పూడి వెంకట సాయికిరణ్‌ అన్నారు. మురళీనగర్‌ వైశాఖి స్పోర్ట్స్‌ పార్కు వనితా భవన్‌లో వనితా వాకర్స్‌ క్లబ్‌ అధ్యక్షురాలు పి.ప్రభావతి ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయాబెటిస్‌ ఉన్నవారికి నడక మేలు చేస్తుందన్నారు. క్రమం తప్పకుండా మందులు వేసుకోవడం, సుగర్‌ లెవిల్స్‌ పరీక్షించుకుని మందులు వాడడం తప్పనిసరన్నారు. ఈ సందర్భంగా ఆయనను క్లబ్‌ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్‌ కార్యదరిశ ఎం.జయ, కోశాధికారి కె.భానుమతి, సంయుక్త కార్యదర్శి కార్యదర్శి జి.శిరీషలత, సంయుక్త కార్యదర్శి ఎం.ప్రమీలా రావు, ఎడిటర్‌ సిహెచ్‌.పద్మావతి, సీనియర్‌ కమిటీ సభ్యులు ఆర్‌.స్నేహలత, జి.మంగాదేవి, ఎం.స్వాతి మాధురి, పి.సుభద్ర పాల్గొన్నారు.

వెలిగిన వీధిలైటు


తాటిచెట్లపాలెం వద్ద వీధిలో వీధిలైటు వెలుగులు

సాక్షి ఎఫెక్ట్‌..

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెం వాటర్‌ ట్యాంక్‌ ఎదురుగా గల వీధిలో నెల రోజుల నుంచి వీధి లైట్లు వెలగకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. ఈ సమస్యపై 'వీధిలైటు వెలగక ఇబ్బందులు' అనే శీర్షికన శనివారం 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు సంబంధిత అధికారులు స్పందించారు. ఈ ప్రాంతంలో సోమవారం సిబ్బంది వీధిలైట్లను సరిచేయడంతో వెలుగులు విరజిమ్ముతున్నాయి. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

కార్పొరేషన్‌ రుణాలకు లబ్ధిదారుల ఎంపిక నేడు

- జోన్‌-3 కార్యాలయంలో దరఖాస్తుదారులు హాజరు కావాలి: జెడ్సీ

సీతమ్మధార: స్వయం ఉపాధి పథకాలకు 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి దరఖాస్తులు చేసుకున్న బీసీ, కాపు, బ్రాహ్మణ, క్షత్రియ, రెడ్డి, వైశ్య, ఈబీసీ కార్పొరేషన్ల నిరుద్యోగ యువత మంగళవారం ఆశీలమెట్ట జోన్‌-3 కార్యాలయంలో హాజరు కావాలని జోనల్‌ కమిషనర్‌ శివప్రసాద్‌ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రకాల యూనిట్లను బ్యాంకు రుణాలు, సబ్సిడీ ద్వారా మంజూరు చేసే నిమిత్తం జోన్‌-3 పరిధిలోని 14 వార్డుల నుంచి 2,184 మంది లబ్ధిదారులు పెట్టుకున్న దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి కార్యాలయ సమావేశ మందిరంలో బ్యాంకుల మేనేజర్లు, జోనల్‌ కమిషనర్‌, బీసీ కార్పొరేషన్‌ అధికారుల సమక్షంలో దరఖాస్తుల పరిశీలన, అర్హులైన లబ్ధిదారుల ఎంపిక ముఖాముఖిగా చేస్తామన్నారు. స్వయం ఉపాధి కింద రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు మూడు సెట్ల దరఖాస్తులు, ఆన్‌లైన్‌లో పెట్టుకున్న దరఖాస్తు, ఆధార్‌ కార్డు, రేషన్‌ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జిరాక్స్‌లు, వాహనాల కోసం దరఖాస్తు చేసిన వారు డ్రైవింగ్‌ లైసెన్స్‌ జిరాక్స్‌, మూడు సెట్ల దరఖాస్తులు, ఒరిజినల్‌ ఆధార్‌ కార్డు, రేషన్‌ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, జిరాక్స్‌లు, యూనిట్‌ ఫొటో తీసుకొని జోన్‌-3 కార్యాలయానికి రావాలని జెడ్సీ కోరారు.

ఉగాది అవార్డు గ్రహీతలకు సత్కారం


సీతంపేట: ఉగాది సందర్భంగా ప్రభుత్వ పురస్కారం పొందిన కళారత్న, ఉగాది అవార్డు గ్రహీతల సత్కారం కార్యక్రమం రైటర్స్‌ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్‌ పౌర గ్రంథాలయంలో నిర్వహించారు. రైటర్స్‌ అకాడమీ వ్యవస్థాపకుడు వి.వి.రమణమూర్తి, పశ్చిమ ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్‌.నాయుడు(గణబాబు) చేతుల మీదుగా వీరిని ఘనంగా సత్కరించారు. కళారత్న పురస్కారాలు అందుకున్న బి.ఎస్‌.రెడ్డి(మ్యాజిక్‌), ఆచార్య కె.సరస్వతి విద్యార్థి(సంగీతం), పాలగుమ్మి రాజగోపాల్‌(సంగీతం), సుంకర చలపతిరావు(పెయింటింగ్‌) ఉగాది పురస్కారాలు అందుకున్న బి.ఆర్‌.విక్రమ్‌కుమార్‌, శిరేల సన్యాసిరావు, బండి సత్యనారాయణ, గుంటుకు వెంకటరావు, అముక్త మాల్యద, టి.హేమవెంకటేశ్వరి, మోకా విజయ్‌కుమార్‌లను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో అకాడమీ కార్యదర్శి మేడా మస్తాన్‌ రెడ్డి, నాంచారయ్య, కళాకారులు, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.


అవార్డు గ్రహీతలతో ఎమ్మెల్యే గణబాబు తదితరులు

'అనారోగ్యంతో మంచం పట్టాను.. ఆదుకోండి'

మహారాణిపేట: 'నేను అనారోగ్యంతో బాధపడుతూ మంచం పట్టాను. నా తల్లిదండ్రులు వృద్ధులు. నాకు ఇంకో ఆధారం లేదు. నా కుటుంబాన్ని ఆదుకోండి' అని సీతంపేటకు చెందిన రవి సహోత కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో అతడు వినతిపత్రం అందజేశాడు. తనకు వివిధ అనారోగ్య సమస్యల వల్ల మంచం మీద ఉండి చికిత్స పొందుతున్నట్లు తెలిపాడు. తమ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉందని వాపోయాడు. రోడ్డు ప్రమాదంలో గాయపడి తీవ్ర అస్వస్థతకు గురైనప్పటి నుంచి మంచం మీద నుంచే చికిత్స పొందుతున్నానని, ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్‌ స్పందించి తమను ఆదుకోవాలని రవి విజ్ఞప్తి చేశాడు.


మంచంపై చికిత్స పొందుతున్న సీతంపేటకు చెందిన రవి సహోత



భగభగ.. 'మండే'



వేసవి ఆరంభం నుంచే ప్రజలను ఠారెత్తిస్తోంది. రోజురోజుకు పెరుగుతున్న ఎండ తీవ్రతకు మనుషులతో పాటు మూగ జీవాలు అల్లాడిపోతున్నాయి. వృక్షాలు వాడిపోతున్నాయి. ఆకులు రాలి నీటి చుక్కకోసం ఎదురు చూస్తున్నట్లుగా ఉన్నాయి. నగరవాసులు భానుడి భగభగల నుంచి పెంపుడు జంతువులను ఎంతో జాగ్రత్తగా సంరక్షిస్తున్నారు.

- ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్‌, విశాఖపట్నం

ప్రయాణం.. ప్రమాదకరం



ఈ ఫొటోలో ఉన్న కుటుంబం చూడ్డానికి కనువిందుగా ఉంది. కానీ వీరి ప్రయాణం మాటున ప్రమాదం పొంచి ఉంది. ఏ మాత్రం దురదృష్టం వెంటాడినా ఆ కుటుంబానికి కన్నీరే మిగులుతుంది. పరిమితికి మించి ద్విచక్ర వాహనంపై ప్రయాణం ప్రమాదకరం. చిన్న పిల్లలతో కలిపి ఐదుగురు అతి కష్టంగా బైక్‌పై వెళ్లడం శ్రేయస్కరం కాదన్న విషయాన్ని ఎపుడు గుర్తిస్తారో..? సీతమ్మధార అల్లూరి సీతారామరాజు జంక్షన్‌ వద్ద సోమవారం 'సాక్షి'కి కంటపడ్డారిలా..

- ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్‌, విశాఖపట్నం

కొండవాలులో సామాజిక భవనాలు ప్రారంభం

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం పరిధి సంజీవయ్య కాలనీ, సంజీవయ్య కాలనీ-2 కొండవాలు ప్రాంతాల్లో సుమారు రూ.48.70 లక్షలతో నిర్మించిన రెండు సామాజిక భవనాలను కార్పొరేటర్‌ కె.కామేశ్వరి ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో జోన్‌-5 కమిషనర్‌ బొడ్డేపల్లి రాము, ఇంజినీరింగ్‌ ఈఈ దిలీప్‌, ఏఈ కోమలి, కూటమి నాయకులు పాల్గొన్నారు.


47వ వార్డులో సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు